క్లుప్తంగా

23 వరకు ఎడిట్ ఆప్షన్

నెల్లూరు (టౌన్): పదో తరగతి పరీక్షల ఫీజు గడువు ముగిసిన నేపథ్యంలో విద్యార్థుల ఆన్‌లైన్ అప్లికేషన్‌లో కరెక్షన్ ఉంటే ఎడిట్ ఆప్షన్ స్కూల్ లాగిన్‌ను అందుబాటులోకి తెచ్చామని డీఈఓ బాలాజీరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్కూల్ రికార్డులు, అపార్ ఐడీ ఆధారంగా ప్రధానోపాధ్యాయులు ధ్రువీకరించుకొని విద్యార్థుల ఆన్‌లైన్ అప్లికేషన్లో మార్పు చేయొచ్చన్నారు. ఎడిట్ ఆప్షన్ స్కూల్ లాగిన్‌లో ఈ నెల 19 నుంచి 23 వరకు అందుబాటులో ఉంటుందని వివరించారు.

వేదగిరిలో విశేష పూజలు



నెల్లూరు సిటీ: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ప్రాతఃకాల దీపారాధన, తిరుప్పావై పారాయణాన్ని మంగళవారం నిర్వహించారు. పూజలను ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో జరిపారు.

విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న కార్తీక్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్‌ను వృథా చేయకుండా పొదుపుగా వినియోగించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత తమపై ఉందని జేసీ కార్తీక్ పేర్కొన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను పురస్కరించుకొని విద్యుత్ భవన్ నుంచి కస్తూర్బా కళాక్షేత్రం వరకు మంగళవారం నిర్వహించిన ర్యాలీని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. విద్యుత్ పొదుపుపై అధికారులు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, ఈఈలు శేషాద్రిబాలచంద్ర, సోమశేఖర్‌రెడ్డి, శ్రీధర్, పరంధామయ్య తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో తనిఖీలు



నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్)లో ఆకస్మిక తనిఖీలను హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ కో ఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులు మంగళవారం చేపట్టారు. పెద్దాస్పత్రికి మాయరోగం అనే శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమవడంతో తనిఖీలను నిర్వహించారు. స్కానింగ్, రక్త పరీక్షల గది, ఓపీలిచ్చే గది, జనరల్ ఫిజీషియన్ ఓపీలను పరిశీలించారు. ఆర్థోపెడిక్, ఫిజియోథెరపీ విభాగాన్ని పరిశీలించి, అందుతున్న సేవలపై రోగులను ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫిజియోథెరపీలో ఒక్క పరికరం సైతం లేదనే విషయం తెలిసిందన్నారు. స్కానింగ్ రూమ్‌లో మెషీన్‌కు ఏసీ లేదని, కొన్ని చోట్ల లోపాలను గుర్తించామని, వీటిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

శ్మశాన వాటికపై దృష్టి సారించరూ..



మంత్రితో మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 53, 54వ డివిజన్లలో గల హిందూ శ్మశాన వాటికకు ప్రహరీ లేకపోవడంతో అన్యాక్రాంతమవుతోందని, దీనిపై దృష్టి సారించాలని వైకుంఠ నగర కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు మంత్రి నారాయణకు వినతిపత్రాన్ని మంగళవారం అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. ఈ డివిజన్లలోని స్థలాలకు రిజిస్ట్రేషన్ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. రోడ్డు విస్తరణలో భాగంగా వెంకటేశ్వరపురం సెంటర్‌లోని దుకాణ యజమానులకు నష్టపరిహారాన్ని ఇవ్వడంలేదని తెలియజేయగా, దీన్ని ఇచ్చేది లేదని మంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండవ రామయ్య, నరసాపురం ప్రసాద్, తిరుమలేశ్వరరావు, అశోక్, ప్రసాద్, రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ పేరిట దోపిడీ

- కేంద్రాల్లో అధిక మొత్తంలో వసూలు
- ప్రజల జేబులకు చిల్లులు
- మార్పులకు రూ.400కుపైగా గుంజుతున్న వైనం
- దళారుల చేతివాటం

- మూడో మైలుకు చెందిన మస్తాన్‌బీ ఆధార్‌లో మార్పులు, చేర్పుల కోసం నెల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రం వద్దకెళ్లారు. గెజిటెడ్ సంతకం అవసరం కావడంతో దాన్ని మేమే ఇప్పిస్తామంటూ రూ.1200ను వసూలు చేశారు. వెటర్నరీ డాక్టర్‌కు సంబంధించిన స్టాంపు వేసి గెజిటెడ్ పత్రాలను సృష్టించి ఆధార్ కార్డును మంజూరు చేశారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇదే తరహా పరిస్థితులు నెలకొన్నాయి.



కలెక్టరేట్లోని ఆధార్ నమోదు కేంద్రం

నెల్లూరు (పొగతోట): ఆధార్ కేంద్రాల్లో దోపిడీ అధికమైంది. ఉచితంగా అందించాల్సిన సేవలకు రూ.వందల్లో వసూలు చేస్తూ ప్రజల జేబులకు చిల్లులు పెడుతున్నారు. నగరంలోని తహసీల్దార్, కలెక్టరేట్, ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలు దోపిడీకి నిలయాలుగా మారాయి.

యథేచ్ఛగా దోపిడీ పర్వం

అనుమతుల్లేకుండా ఆధార్ కేంద్రాలను నిర్వహిస్తూ దోపిడీ పర్వాన్ని యథేచ్ఛగా సాగిస్తున్నారు. వాస్తవానికి ఆధార్‌లో మార్పులు, చేర్పుల కోసం రూ.150, ల్యామినేషన్‌కు రూ.30ను వసూలు చేయాల్సి ఉంది. అయితే వీటి కోసం కొందరు రూ.400 నుంచి రూ.500 వరకు వసూలు చేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే, వేలిముద్రలు పడటంలేదంటూ జాప్యం చేస్తున్నారు.

దళారుల రంగప్రవేశం

ఆధార్ కేంద్రాల వద్ద నిర్వాహకులు, దళారులు కుమ్మక్కై, అమాయకులను మోసగిస్తున్నారు. కొత్త ఆధార్ కార్డును ఉచితంగా అందించాల్సి ఉంది. అయితే గెజిటెడ్ సంతకాలు, స్థానికంగా ఉండే పత్రాలు తదితరాలు కావాలంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. పత్రాలను తామే సమకూరుస్తాం.. కార్డుకు రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు ఖర్చవుతుందంటూ అక్రమంగా వసూలు చేస్తున్నారు. డబ్బులిచ్చేందుకు సిద్ధమైతే ముందుగానే తమ వద్ద ఉంచిన అధికారుల స్టాంపులేసి గెజిటెడ్, స్థానిక నివాస ధ్రువీకరణ పత్రాలను సృష్టించి కార్డులను అందజేస్తున్నారు. ఈ వ్యవహారం చాపకింద నీరులా సాగుతున్నా, అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు.

అనుమతుల్లేకుండానే నిర్వహణ

జిల్లావ్యాప్తంగా గతంలో 300కుపైగా ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే వీటిని ప్రస్తుతం మూసేశారు. మరోవైపు అధిక శాతం మంది ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోలేదు. వీటి సవరణ, చిరునామా మార్పు కోసం ఈ కేంద్రాలకు వెళ్తున్నారు. ప్రభుత్వ పథకాల మంజూరు తదితరాలకు ఇది తప్పనిసరైంది. నగరంలో మూడు కేంద్రాలకు అనుమతి ఉండగా, ఇవి లేకుండానే పదింటిని నిర్వహిస్తున్నారు. ఈ విషయం సంబంధిత అధికారులకు తెలిసినా మిన్నకుండిపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాక..

ఆధార్‌లో మార్పులు, చేర్పులు చేసేందుకు బ్యాంకుల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను ప్రస్తుతం తొలగించారు. సచివాలయాల్లో ఆధార్ నమోదు, మార్పులు, చేర్పులకు అవకాశం కల్పిస్తామని చెప్పినా, ఈ సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. వీటిని త్వరితగతిన వినియోగంలోకి తీసుకొచ్చి, ప్రజల ఇక్కట్లను తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సచివాలయాల్లో ఆధార్ కేంద్రం

ఆధార్ సేవలకు అధికంగా వసూలు చేస్తే కేసులు నమోదు చేస్తాం. జిల్లాలోని ఆధార్ నమోదు కేంద్రాలను తొలగించాం. సచివాలయాల్లో ఈ సేవలకు ప్రత్యేక అవకాశం కల్పించారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలి.
– శ్రీరాములు, ఈడీఎం

మైనార్టీల హక్కులపై సమావేశం నేడు

నెల్లూరు(అర్బన్): మైనార్టీల హక్కులను ప్రభుత్వాలు కాపాడుతున్నాయా.. కాలరాస్తున్నాయా అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని బుధవారం ఉదయం నిర్వహించనున్నామని ఆవాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రషీద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూలే విగ్రహ సమీపంలోని భవన నిర్మాణ కార్మిక సంఘ జిల్లా కార్యాలయంలో నిర్వహించనున్న సమావేశానికి ఆసక్తి గలవారు హాజరుకావాలని కోరారు.

ఘన నివాళి



నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న గిరికుమార్ గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. ఈ క్రమంలో పొదలకూరు రోడ్డులోని ఆయన నివాసానికి కమిషనర్ సూర్యతేజ, అదనపు కమిషనర్ నందన్ వెళ్లి పార్థివదేహానికి నివాళులర్పించారు. గిరికుమార్ కుటుంబసభ్యులకు కారుణ్య నియామకం ద్వారా నగరపాలక సంస్థలో ఉద్యోగాన్ని కల్పించనున్నామని కమిషనర్ తెలిపారు.

సీనియర్ సిటిజన్లకు న్యాయ విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న వాణి

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో సీనియర్ సిటిజన్స్ స్పోర్ట్స్, కల్చరల్ మీట్, న్యాయ విజ్ఞాన సదస్సును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని ఆదేశాల మేరకు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి మాట్లాడారు. తల్లిదండ్రులు, వయోవృద్ధులను నిర్లక్ష్యం చేయడం పిల్లలకు తగదని సూచించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. సూపరింటెండెంట్ సంధ్యారాణి, సీనియర్ సిటిజన్స్ ప్రెసిడెంట్ పద్మాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఈ బాధ్యతల స్వీకరణ



నెల్లూరు(బారకాసు): పని సర్దుబాటు నిమిత్తం ఒంగోలు నగరపాలక సంస్థ నుంచి వచ్చిన ఎన్విరాన్‌మెంటల్ ఏఈ అర్పిత బాధ్యతలను మంగళవారం స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ సూర్యతేజను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు

నెల్లూరు(క్రైమ్): బెల్టు షాపులను నిర్వహిస్తే చర్యలు తప్పవని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నెల్లూరు – 2 ఇన్‌స్పెక్టర్ ప్రసన్నలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్టేషన్ పరిధిలోని వెంకటాచలం, మనుబోలు మండలాల్లో బెల్టు షాపులపై అక్టోబర్ 30 నుంచి ఇప్పటి వరకు 24 కేసులు, బహిరంగ మద్యసేవనంపై మూడు, గంజాయి అక్రమ రవాణాపై ఒక కేసును నమోదు చేశామని చెప్పారు. 390 మద్యం సీసాలు, ఎనిమిది కిలోల గంజాయి సీజ్ చేశామని పేర్కొన్నారు. ప్రజలు తమ ప్రాంతాల్లో బెల్టు, గంజాయి అక్రమ రవాణా, విక్రయాలను గుర్తిస్తే 94409 02512, 81069 59005 నంబర్లకు సమాచారమివ్వాలని కోరారు.

హెచ్‌డీఎస్ కమిటీ తొలి సమావేశం నేడు

నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో హెచ్‌డీఎస్ కమిటీ ఏర్పడిన అనంతరం తొలి సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నారు. కలెక్టర్ ఆనంద్ అధ్యక్షతన సమావేశాన్ని జరపనున్నారు. జిల్లాకే రెఫరల్ ఆస్పత్రిగా ఉన్న ఇక్కడికి వేలాది మంది రోగులు వస్తున్నారు. అత్యంత అనుభవజ్ఞులైన డాక్టర్లు, ఆధునిక భవనాలు, థియేటర్లున్నా.. చిన్న లోపాలతో రోగులకు సేవలందించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పని చేసే డాక్టర్లు శక్తికి మించి సేవలందిస్తున్నారు. తప్పించుకొని తిరిగే డాక్టర్లు ప్రైవేట్ ఆస్పత్రుల సేవల్లో తరిస్తున్నారు. ఇలాంటి లోపాలను సరిచేయాల్సి ఉంది. ప్రధానంగా ఓపీలో డాక్టర్లు సమయపాలన పాటించడం లేదు. రక్త పరీక్షల గది వద్ద మంచినీటి సౌకర్యం లేదు. స్కానింగ్ రూమ్ వద్ద ప్రింటర్, స్కానర్లు, స్టేషనరీ, రిజిస్టర్లు లేవు. ఫిజియోథెరపీ చేసేందుకు యంత్రాలు కరువయ్యాయి. కాజ్యువాల్టీలో ఎమర్జెన్సీ మందులకు కొరత ఉంది. ఈ లోపాలను సరి చేస్తారో.. లేదో వేచి చూడాల్సి ఉంది. కాగా మురుగునీటి శుద్ధి ప్లాంట్, ఫైర్ ఎన్‌ఓసీ, విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు, తల్లీ.. బిడ్డ వార్డులో సివిల్ వర్క్స్, ఫిజియోథెరపీ పరికరాలు, వీవీఐపీలకు అంబులెన్స్, స్టేషనరీ తదితర అంశాలను అజెండాలో చేర్చారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత



నెల్లూరు (టౌన్): కొండాయపాళెంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బహుమతులను రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రదానం చేశారు. ఇటీవల నిర్వహించిన పీటీఎంలో అనర్గళంగా ప్రసంగించిన సాత్విక్, నృత్యం, స్కిట్స్ ప్లే చేసిన విద్యార్థులకు లంచ్ బ్యాగ్, పెన్నులు తదితరాలను అందజేశారు. రోటరీ క్లబ్ సౌత్ ప్రెసిడెంట్ శ్రీహరి, కార్యదర్శి మలికాబేగం, మాజీ ప్రెసిడెంట్ గోవిందరాజు సుభద్రాదేవి, హెచ్ఎం భాస్కర్‌రావు పాల్గొన్నారు.

నిరాశ్రయుల వసతిగృహ సందర్శన



దుప్పట్లు పంపిణీ చేస్తున్న తేజ్‌భరత్

నెల్లూరు(బారకాసు): సంతపేటలోని నిరాశ్రయుల వసతిగృహాన్ని మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్ మంగళవారం సందర్శించారు. వివిధ సమస్యలను గుర్తించి, వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భవన మరమ్మతులు, విద్యుత్ వ్యవస్థ, మరుగుదొడ్లను అధునాతనంగా నిర్మించాలని చెప్పారు. జీవనోపాధి కేంద్రాన్ని ఏర్పాటు చేసి షెల్టర్‌లో ఉన్న నిరాశ్రయులకు ఉపాధి కల్పించాలని తెలిపారు. అనంతరం నిరాశ్రయులకు దుప్పట్లను పంపిణీ చేశారు. మెప్మా పీడీ రాధమ్మ, రాష్ట్ర మిషన్ మేనేజర్ ఆదినారాయణ, శ్రీనివాస్, ప్రభావతి, సామాజిక భద్రత విభాగ జిల్లా నిపుణుడు కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

లీగల్ సెల్ అధికారులతో సమావేశం



నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్‌కు సంబంధించిన కోర్టు కేసులపై లీగల్ సెల్ విభాగంతో సమీక్ష సమావేశాన్ని మేయర్ స్రవంతి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కేసులను త్వరితగతిన పరిష్కరించేలా తగు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు రంగారావు, నాగేశ్వరరావు, మేనేజర్ ఇనాయతుల్లా, సూపరింటెండెంట్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా కమిటీ సమావేశం



మాట్లాడుతున్న ఆనంద్

నెల్లూరు రూరల్: నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా కమిటీ సమావేశాన్ని కలెక్టర్ ఆనంద్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. కలెక్టర్ చాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంకల్ప్ నిధుల వినియోగంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ శిక్షణ కార్యక్రమాల నిర్వహణకు నిధులను వినియోగించాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ పాలిటెక్నిక్, ఐటీఐ, జూనియర్, డిగ్రీ కళాశాల్లో స్కిల్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యూమ్ తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడు మంత్రికి సత్కారం



నెల్లూరు(సెంట్రల్): తమిళనాడు టూరిజం కార్పొరేషన్‌కు టీటీడీ ప్రత్యేక దర్శన టికెట్లను కేటాయించాలని ఆ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి రాజేంద్రన్ కోరారు. ఈ మేరకు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నివాసానికి మంగళవారం ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలికారు. మంత్రులు ఫరూఖ్, పొంగూరు నారాయణ, ఎమ్మెల్యేలు కృష్ణారెడ్డి, కాకర్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

బ్రాందీ షాపు క్యాషియర్‌పై దాడి

నెల్లూరు(క్రైమ్): తమపైనే పోలీసులకు ఫిర్యాదు చేస్తావా.. నీకెంత ధైర్యం అంటూ బ్రాందీ షాప్ క్యాషియర్‌పై దాడి చేసిన నిందితులపై చిన్నబజార్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. అయ్యప్పగుడి సమీపంలోని టీచర్స్ కాలనీకి చెందిన శ్రీనివాసులు పరమేశ్వరినగర్‌లోని లక్కీ వైన్స్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్నారు. షాపు ప్రారంభమైన రోజు నుంచే దాన్ని తొలగించాలంటూ కోటమిట్టకు చెందిన జుబేర్, జిలానీ మరికొందరు ఆందోళన చేస్తున్నారు. వ్యాపారం జరగకుండా కొనుగోలుదారులను అడ్డుకోసాగారు. ఈ విషయమై పోలీసులకు శ్రీనివాసులు గతంలో ఫిర్యాదు చేశారు. ఈ తరుణంలో షాపులో శ్రీనివాసులు సోమవారం రాత్రి ఉండగా, జుబేర్, జిలానీ మరికొందరు అక్రమంగా ప్రవేశించి దాడి చేశారు. మద్యం బాటిళ్లను ధ్వంసం చేశారు. ఘటనలో ఆయన గాయపడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారనే ఫిర్యాదుతో అఘోరి శ్రీనివాస్‌పై చిన్నబజార్ పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై నేషనల్ కన్జ్యూమర్ రైట్స్ అండ్ యాంటీ క్రైమ్‌బ్యూరో నేతలు, మైనార్టీ నేత సయ్యద్ సమీ హుస్సేనీ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చీటీలంటూ మోసం

నెల్లూరు(క్రైమ్): చీటీల పేరిట మోసగించిన వ్యక్తిపై చీటింగ్ కేసును పోలీసులు మంగళవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఎన్టీఆర్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఆక్వా టెక్నీషియన్ నరేంద్ర మూలాపేటకు చెందిన చిరంజీవి వద్ద రూ.పది లక్షల చీటీ వేసి 16 నెలలు కట్టారు. అనంతరం చీటీ పాడారు. రెండు నెలలుగా చిరంజీవి ఫోన్ తీయకుండా, సమాధానం చెప్పకుండా తప్పించుకొని తిరసాగారు. దీంతో నిర్వాహకుడి ఇంటికి బాధితుడు వెళ్లారు. అక్కడ లేకపోవడంతో విషయాన్ని అతని కుటుంబసభ్యులకు చెప్పారు. కొంత సమయమిస్తే కడతామని వారు చెప్పడంతో వేచి చూశారు. ఇటీవల గట్టిగా నిలదీయడంతో, వారు అసభ్యకర పదజాలంతో నరేంద్రను దూషించారు. తనను మోసగించిన చీటీల నిర్వాహకుడిపై చర్యలు చేపట్టాలని కోరుతూ చిన్నబజార్ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలతో అసభ్యకర ప్రవర్తన

నెల్లూరు(క్రైమ్): మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఇద్దరు వ్యక్తులపై చిన్నబజార్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. వాకర్స్ రోడ్డుకు చెందిన మహిళలు లక్కీ వైన్ షాపునకు వ్యతిరేకంగా కొద్ది రోజులుగా ఆందోళన చేస్తున్నారు. ఈ క్రమంలో వైన్ షాపులో పనిచేస్తున్న ఓ వ్యక్తి మహిళలను ఉద్దేశించి అసభ్యకరంగా సైగలు చేశారు. ఇదే సమయంలో షాపులోని క్యాష్ కౌంటర్‌లో ఉన్న మరో వ్యక్తి డబ్బులు చూపిస్తూ సైగలు చేయడంతో పాటు వీడియోలు, ఫొటోలు తీశారు. బాధిత మహిళల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి



దేవదాయ శాఖ జిల్లా అధికారి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

నెల్లూరు(బృందావనం): రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధి.. హైందవ ధర్మ పరిరక్షణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. రంగనాయకులపేటలోని చిత్రకూటంలో నిర్మించిన దేవదాయ శాఖ జిల్లా అధికారి కార్యాలయ భవనాన్ని మంగళవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్యాలయాన్ని రూ.85 లక్షలతో నిర్మించారని చెప్పారు. మొదటి అంతస్తు నిర్మాణ పనులను దేవదాయ శాఖ నిధులతో త్వరలోనే పూర్తి చేస్తామని వివరించారు. రంగనాథస్వామి ఆలయ ఘాట్ పనులను పూర్తి చేసేందుకు మంత్రి నారాయణ దృష్టి సారించారని పేర్కొన్నారు. వేణుగోపాలస్వామి ఆలయంతో పాటు, నగరంలోని ప్రముఖ ఆలయాలను త్వరలో తాను, నారాయణ పరిశీలించి అభివృద్ధికి చర్యలు చేపడతామని ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని ఆలయాలకు పాలకమండళ్లను త్వరలోనే నియమించనున్నామని, ఇందులో బ్రాహ్మణులు, నాయీబ్రాహ్మణులకు స్థానం కల్పిస్తామని వెల్లడించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఫరూఖ్, మంత్రి నారాయణ, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కావలి, వెంకటగిరి, ఉదయగిరి ఎమ్మెల్యేలు కృష్ణారెడ్డి, రామకృష్ణ, సురేష్, దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పింఛనర్ల దినోత్సవం



సత్కార గ్రహీతలతో నిర్వాహకులు



పురమందిరంలో..

నెల్లూరు(బృందావనం): భక్తవత్సలనగర్‌లోని పెన్షనర్ల భవన్‌లో జాతీయ పింఛనర్ల దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్సెమ్ గౌస్, ఎస్వీవీఎన్ మూర్తి పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, ట్రెజరీస్, అకౌంట్స్ జిల్లా అధికారి గంగాద్రి హాజరయ్యారు. తొలుత జాతీయ పతాకం, పింఛనర్ల సంఘ జెండాను ఆవిష్కరించారు. సంఘ భవన నిర్మాణానికి ఆర్థిక సాయం చేసిన 51 మంది దాతల పేర్లతో శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రామానుజాచార్యులు విగ్రహానికి పూలమాల వేశారు. పింఛన్ల కోసం నిరంతర పోరాటం చేసి సాధించిన నకర చిత్రపటానికి నివాళులర్పించారు. భవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన టెలివిజన్, అసోసియేషన్ క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గంగాద్రి మాట్లాడారు. పింఛనర్ల లైఫ్ సర్టిఫికెట్లను ఫిబ్రవరి 25లోపు పూర్తి చేసేలా నగరంలోని కలెక్టరేట్, బాలాజీనగర్, మూలాపేట తదితర ప్రాంతాల్లో సెంటర్లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అనంతరం 30 మంది పింఛనర్లను సత్కరించారు. ఉపాధ్యాయ ఉద్యమ నేత బాబురెడ్డి, ఇందిర డెంటల్ సూపర్ స్పెషాల్టీ హాస్పిటల్ అధినేత వివేకానందరెడ్డి, అసిస్టెంట్ ట్రెజరీ అధికారి అహ్మద్, అసోసియేషన్ కోశాధికారి హజరత్తయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి రఘునాథ్, గోపాల్, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

➡ పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ మందిరంలో జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ వైద్య, ఆరోగ్య విశ్రాంత ఉద్యోగుల సంఘ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం విశ్రాంత వైద్యులు, అధికారులను సత్కరించారు. సంఘ గౌరవాధ్యక్షుడు డాక్టర్ విద్యాసాగర్, అధ్యక్ష, కార్యదర్శులు హరిబాబు, కల్పం శ్రీనివాసులు, హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు, విశ్రాంత ఉద్యోగుల సంఘ గౌరవ సలహాదారు డాక్టర్ మున్వర్ సుల్తానా, శేషగిరిరావు, కోశాధికారి నాగేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శి రమణయ్య, ఇందిర, పరిమళ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.